# ది సిద్దిపేట టైమ్స్



తెలుగు దినపత్రిక


సిద్దిపేట(మెదక్) | 2025, జనవరి 10 | శుక్రవారం | ఎడిటర్ : లోక రవిచంద్ర | సంపుటి:13 | సంచిక:101 | పేజీలు : 4 | వెల : 2/-


# నేడు పుల్లూరు బండపై వైకుంఠ ఏకాదశి ఉత్సవం



## ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి

**సిద్ధిపేట, జనవరి 5 (ది సిద్ధిపేట టైమ్స్):** సిద్ధిపేట మండలం పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 10 న "వైకుంఠ ఏకాదశి ఉత్సవం", ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవాలయం వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్య, పొడిచేటి శ్రీనివాసా చారి, పుల్లూరు బండ దేవస్థాన కమిటీ చైర్మన్ పుల్లూరు కనకయ్య గౌడ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేసారు. శుక్రవారం పుల్లూరు లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవం వైభవంగా జరుపనున్నారు. పుష్య మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశి ఎంతో పవిత్రమైనదిగా బక్తులు భావిస్తారు. ముక్కోటి దేవతల కోరిక మేరకు శ్రీ మహావిష్ణువు ఈ వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా ముక్కోటి దేవతలకు, సకల ప్రాణికోటికి దర్శనం ఇవ్వడానికి సమ్మతించినట్లు పురాణాలు చెబుతున్నాయి. వేద కాలం నుంచి వేల సంవత్సరాలుగా ఈ రోజున ముక్కోటి దేవతలు శ్రీ మహావిష్ణువును ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకుంటారు. కలియుగంలో ఈ రోజున భక్తులందరు ఉత్తర



ద్వారం గుండా దర్శనం చేసుకోవడం పుణ్యంగా భావిస్తారు. అందులో భాగంగా శ్రీ వైష్ణవ సాంప్రదాయాన్ని ఆచరించే అన్ని దేవాలయాల్లో ఉత్తర ద్వారం గుండా భక్తులకు స్వామిని దర్శనం కల్పిస్తున్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వేల సంవత్సరాల కిందట స్వయంభువుగా వెలసిన పుల్లూరు బండ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవం జరుగుతోంది. ఈ రోజు ప్రాచీన దేవాలయమైన పుల్లూరు బండ దేవాలయ ఉత్తర ద్వారం గుండా లక్ష్మీ నరసింహ స్వామిని, కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం ఉదయం 4 గంటలకు స్వయంభు లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకము, అలంకరణ జరుగుతాయి. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను శావపై ఊరేగించి ఉత్తర ద్వారం గుండా స్వామిని దేవాలయంలోకి తీసుకు వెళ్తారు. అటు పిమ్మట దేవాలయానికి వచ్చే భక్తులందరికీ ఉత్తర ద్వారం గుండా లక్ష్మీ నరసింహ స్వామిని, వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి అనుమతి ఇస్తారు. ఉదయం ఐదున్నరకు దర్శనాలు ప్రారంభమవుతాయని కలకుంట్ల రంగాచార్య వెల్లడించారు. మహా పవిత్రమైన ఈ రోజున భక్తులు స్వయంభు లక్ష్మీనరసింహస్వామిని, వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే తాము కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజున జరిగే ఉత్సవంలో, ఉత్తర ద్వార దర్శన మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**మోహినీపురలో దేవాలయంలో భారీ ఏర్పాట్లు**

సిద్ధిపేట మోహినీపుర వీధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 4.30గంటలకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణం వెలుగులీనుతున్నది. గత సంవత్సరం మాదిరిగానే 5 లైన్లలో దర్శనం కోసం భక్తులను అనుమతిస్తారు. స్థానికులకు వీఐపీ క్యూలో ప్రక్క క్యూ లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు అనుమతిస్తున్నారు. ఎలాంటి పాసులు జారీ చేయలేదు. డోనర్లు క్యూలో వైకుంఠ ఏకాదశి ఆలయ అభివృద్ధి, నిత్యాన్నదాన భవనం, వెండి బంగారు ఆభరణముల డోనర్లు మొదలైన వారికి ఇచ్చిన డోనర్ ఐడీ కార్డుల ద్వారా భార్యాభర్తలు పిల్లలు కలిపి నలుగురికి స్వామి దర్శనానికి అనుమతివ్వనున్నారు. వీఐపి క్యూలో విలేకరులు, అధికారులు, కౌన్సిలర్లు స్వామివారిని దర్శించుకోవడానికి అనుమతిస్తారు. వీవీఐపి క్యూలో మంత్రులు శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, జిల్లా మెజిస్ట్రేట్లు,



జిల్లా అధికారులు దర్శించుకోవడానికి ఏర్పాటు చేశారు.

**దుబ్బాకలో..**

**వైకుంఠవాసుని ఉత్తర ద్వార దర్శనానికి సిద్ధం.**

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని దుబ్బాకలోని శ్రీబాలాజీ ఆలయంలో వైకుంఠ ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ తెలిపారు. ఆలయ ట్రస్టు సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. బారికేడ్లు, క్యూలు, బందోబస్తుకు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, రాంపురం శారదాపీఠం పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి హాజరుకానున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు కమిషనర్ రమేశ్ కుమార్ తెలిపారు.

# భూ భారతి కి గవర్నర్ ఆమోదం

## అమలుకు సర్కారు సన్నాహాలు

- ఇకపై భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- మెరుగైన, సమగ్ర రెవెన్యూ సేవలకు రూపకల్పన
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జనవరి 9 (ది సిద్ధిపేట టైమ్స్)** : తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన 'భూ భారతి' చట్టానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం ఆమోదం తెలిపారు. దాంతో ఇకపై ధరణి స్థానంలో భూ భారతి అమలుకు మార్గం సుగమమైంది. గవర్నర్ ఆమోదించిన భూభారతి బిల్లు కాపీని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం సచివాలయంలో ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి చట్టాన్ని గత నెల 20న అసెంబ్లీ వేదికగా రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం దానికి స్థానంలో భూ భారతికి ఆమోదం తెలిపింది. మరుసటి రోజు శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోద ముద్ర వేశారు. దాంతో వెంటనే గవర్నర్ ఆమోదం కోసం వెళ్లగా.. తాజాగా గురువారం దానికి ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిల్లుకు ఆమోదం లభించడంతో వీలైనంత త్వరలో ఈ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలు ఎదుర్కొంటున్న బాధితులకు మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే

మిగతా 2లో

# అక్రమంగా కేటీఆర్ ను వేధిస్తున్నారు

## బీఆర్ఎస్ పార్టీ సిద్ధిపేట పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి


**సిద్ధిపేట, జనవరి 9 (ది సిద్ధిపేట టైమ్స్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయించి రేవంత్ సర్కారు పూర్తిగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ సిద్ధిపేట పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి అన్నారు. సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కేటీఆర్ పై నమోదు చేసిన కేసులో ఏమీ లేదని మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ ప్రెస్ నోట్ రిలీజ్ చేశారని గుర్తు చేశారు. కేటీఆర్ వెంట తన లాయర్ విచారణకు హాజరైతే వారికి వచ్చే నష్టం ఏంటో

మిగతా 2లో

# ప్రపంచ వ్యాప్తంగా భారత గౌరవం పెంచుతున్న ఎన్నారైలు

## ప్రధాని నరేంద్ర మోదీ

- ఏ నాయకుడిని కలిసినా గొప్పగా చెబుతారు
- 2047 లక్ష్యం కోసం కలిసి పనిచేద్దాం



**భువనేశ్వర్:** ఎన్నారైల సత్ప్రవర్తన ప్రపంచవ్యాప్తంగా భారత్ ను తలెత్తుకునేలా చేస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి ఒడిశాకు వచ్చిన ప్రవాస భారతీయులతో ఆయన సమావేశమయ్యారు. భారత వృద్ధిలో ఎన్నారైల సహాయ, సహకారం ఎంతో అవసరం అన్నారు. భువనేశ్వర్ లో జరిగిన 18వ ప్రవాసీ భారతీయ దివస్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం పాల్గొని ప్రసంగించారు.

ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశ నాయకుడిని కలిసినా భారత విధానం, తమ తమ దేశాల్లో ఎన్నారైల తీరును గురించి వారు గొప్పగా చెబుతుంటారన్నారు. అది తనకెంతో గర్వంగా ఉంటుందన్నారు. ఈ గౌరవానికి పూర్తిహక్కుదారులు మీరేనన్నారు. ఏ దేశానికి వెళ్లినా అక్కడి సమాజంతో ఆ దేశాభివృద్ధి కోసం భారతీయులు కృషి చేసే విధానం ఎంతో గొప్పదన్నారు. మేక్ ఇన్ ఇండియా ప్రాజెక్ట్ ద్వారా పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి విముక్తులను చేయగలిగామని తెలిపారు. భారత డిజిటల్ శక్తిని చూసి నేడు ప్రపంచమే ఆశ్చర్యపోతున్నదన్నారు. చంద్రయాన్ , ఇంధనం, బుల్లెట్ రైలు, ఆటోమోబైల్ ఇలా అన్ని రంగాల్లోనూ భారీ పురోగతిని సాధిస్తున్నామన్నారు. ప్రస్తుతం భారత్ చెబుతుంటే ప్రపంచం శ్రద్ధగా వింటున్నదని మోదీ అన్నారు. ప్రపంచంలో భారత్ పాత్రను విస్తరించడంలో ఎన్నారైల కృషి ఎనలేనిదన్నారు. ప్రస్తుతం మనముందు 2047 లక్ష్యం ఉందన్నారు. ఈ లక్ష్యం నెరవేరాలంటే ప్రతి ఎన్నారై సహకరించాలని పిలుపునిచ్చారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు భారతదేశ చరిత్ర విదేశాల్లో మారుమ్రోగించడంలో మీ పాత్ర ఉండాలని ప్రధాని సూచించారు. సింగపూర్, అమెరికా ఇలా ఎన్నో దేశాల్లో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు సంబంధించిన ఎన్నో పండుగలు నిర్వహించుకోవడం దేశ చరిత్రకు, ప్రజలకు గర్వకారణమని ప్రధాని మోదీ అన్నారు.

# గురుకుల ప్రవేశాలకు ఆహ్వానం

**సిద్ధిపేట, జనవరి 9 (ది సిద్ధిపేట టైమ్స్ ):** ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో చేరి విద్యావంతులై విజేతలుగా నిలవాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాసంస్థల్లో 5వ తరగతి ప్రవేశాలు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9 తరగతులలో ఖాళీల ప్రవేశాలకు, గౌలిదొడ్డి, అలుగునూరులో 9వ తరగతి ప్రవేశాలు, ఖమ్మం, పరిగిలలో 8వ తరగతి ప్రవేశాలు, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు 202526 విద్యా సంవత్సరానికి గాను కామన్ ప్రవేశ పరీక్షకు (ఇంగ్లీషు మీడియం) జిల్లా నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం దరఖాస్తులను https://tgcet.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ లో మాత్రమే సమర్పించాలన్నారు. అలాగే దరఖాస్తులకు ఫిబ్రవరి 1 చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23వ తేదిన ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి కులం సర్టిఫికేట్ నెంబరు, ఆదాయం సర్టిఫికెట్ నెంబరు, ఆధార్ కార్డు నెంబర్, బర్త్ సర్టిఫికేట్ ఫొటోలు అవసరమన్నారు. సర్టిఫికెట్ల సత్వర జారీ కోసం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రకటనలో వివరించారు.

# సంక్షేమం పట్టని సర్కార్

## కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

## సీఎం రేవంత్ కు కేంద్రమంత్రి బహిరంగలేఖ

- ఆరోగ్యశ్రీ , ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిల కోసం డిమాండ్
- రూ.8 వేల కోట్లు చెల్లిస్తే పేదరోగులు, విద్యార్థులకు మేలు
- బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ పాలన
- నోటితో పొగిడి నొసటితో వెక్కిరించినట్లుగా ప్రభుత్వ తీరు
- తీరు మార్చుకోకుంటే బీజేపి ఆధ్వర్యంలో ఉద్యమం



**హైదరాబాద్, జనవరి 09 (ది సిద్ధిపేట టైమ్స్):** సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తూ పేదల బతుకులతో తెలంగాణ ప్రభుత్వం ఆటలాడుకుంటున్నదని కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో నిరుపేదలకు విద్యా, వైద్య సేవలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తామని ప్రైవేటు దవాఖానాలు అల్టిమేటం ఇచ్చాయని చెప్పారు. ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో ఇప్పటికే వేలమంది విద్యార్థులు చదవుకు దూరమయ్యారని వివరించారు. వెంటనే ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగలేఖ రాశారు. విద్య, వైద్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, నిర్లక్ష్య ధోరణి కోట్ల మంది తెలంగాణ ప్రజలను తీవ్రమైన ఆందోళనకు గురిచేస్తోందని ఈ లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని పేద కుటుంబాల ఆరోగ్యానికి, ఉన్నత విద్యకు భరోసాగా నిలిచిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాలు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల పూర్తిగా నీరుకారిపోతున్నాయని దుయ్యబట్టారు. 'నెలల తరబడి ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో ఈనెల 10 నుండి రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులు విడుదల చేసిన ప్రకటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కోట్ల మంది పేద ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు ఇబ్బంది పడుతున్నా మీరు పట్టించుకోకపోవడం బాధాకరం. ఆరోగ్యశ్రీ పథకం అమలులో మీరు అనుసరిస్తున్న తీరు 'నోటితో పొగిడి నొసటితో వెక్కిరించినట్లుగా'ఉంది. ఒకవైపు 'ఆరోగ్యశ్రీ' పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు, ఆరోగ్య సేవలను విస్తరిస్తున్నట్లు ప్రకటించిన మీరు ఆచరణకు వచ్చేసరికి అసలు బిల్లులే


మిగతా 2లో

సిద్ధిపేట టైమ్స్
తెలుగు దినపత్రిక



# అయోధ్య రాముడికి మహా సంప్రోక్షణ

## జనవరి 11 నుంచి 13వరకు నిర్వహణ



**లక్నో:** అయోధ్య శ్రీ రామమందిర ప్రతిష్ఠాపన జరిగి ఒక సంవత్సరం పూర్తైన సందర్భంగా జనవరి 11న ప్రతిష్ఠాపన మహా సంప్రోక్షణ నిర్వహించనున్నారు. గురువారం ఈ విషయాన్ని అయోధ్య రామ మందిర ఆలయ కమిటీ మీడియాకు వివరించింది. మహాసంప్రోక్షణ సందర్భంగా బాలరాముడిని పీతాంబరి వేషధారణలో అలంకరిస్తారు. ప్రత్యేక దుస్తులను ధరింప చేస్తారు. ఢిల్లీలో ప్రత్యేక దుస్తులు సిద్ధం చేశారు. బంగారం, వెండి తీగలతో బాలరాముడి బట్టలకు ఎంబ్రాయిడరీ పనులు పూర్తయ్యాయి. శుక్రవారం నాటికి ఈ ప్రత్యేక దుస్తులు అయోధ్యకు చేరుకుంటాయి. ఈ దుస్తులను మనీష్ త్రిపాఠి అనే డిజైనర్ రూపొందించారు. 11, 12, 13 తేదీల్లో మూడు రోజులపాటు మహా సంప్రోక్షణ వేడుకలు నిర్వహించనున్నారు. 11న శంకుస్థాపనతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఉదయం పది గంటలకు ప్రత్యేక పూజలు, దీక్షలు, అభిషేకం నిర్వహిస్తారు. మధ్యాహ్నం హారతి, రాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో బాలరాముడికి ప్రత్యేక దుస్తులతో పాటు ప్రత్యేక నగలను కూడా ధరింప చేయనున్నారు. రత్నాలు, పట్టువస్త్రాలు, ధోవతీ, కిరీటం, బంగారు హారం, ఇతర ఆభరణాలను సిద్ధం చేశారు. అయోధ్యకు ప్రస్తుతం రోజుకు లక్ష మంది భక్తులు వస్తున్నారు. మహాకుంభ మేళా సందర్భంగా ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

# నేడు కలెక్టర్లతో సీఎం కీలక సమావేశం



**హైదరాబాద్, జనవరి 9 ( ది సిద్ధిపేట టైమ్స్ ):** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో భేటీ కానున్న రేవంత్ రెడ్డి ఐదు ఎజెండాలపై వారికి దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో.. ప్రజల్లోకి ప్రభుత్వ పథకాల గురించి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు, అధికారులు పలు కార్యక్రమాలు చేపట్టాలని ఇదివరకే సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ క్రమంలో అన్ని జిల్లాల్లో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, ఇంకా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి అనే అంశాల మీద రేపు సీఎం కలెక్టర్లతో చర్చించనున్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించేందుకు కాంగ్రెస్ కసరత్తు ప్రారంభించిందని తెలుస్తోంది.

# కేటీఆర్ కు సుదీర్ఘ విచారణ



హైదరాబాద్, జనవరి 9 (ది సిద్ధిపేట టైమ్స్): ఫార్ములా ఈ కారు రేసు కేసులో మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు 7 గంటల పాటు విచారించారు. రేసు నిర్వహణ, విదేశాలకు డబ్బుల బదలాయింపుపై పలు ప్రశ్నలు వేశారు. ఫార్ములా ఈకారు రేసింగ్ కేసులో కేటీఆర్ పాత్రపై ఏసీబీ అధికారులు వివరాలు అడిగారు. అధికారులు అడిగిన ప్రతీ దానికి సమాధానమిచ్చానన్న కేటీఆర్.. కేసులకు భయపడేది లేదని, హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఫార్ములా ఈరేసు కేసు వ్యవహారంలో కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీనిపై తక్షణ విచారణ అవసరం లేదని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. జనవరి 15న క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుపుతామని వెల్లడించింది.

# అక్రమంగా కేటీఆర్ ను వేధిస్తున్నారు

## బీఆర్ఎస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి



▶▶ మొదటి పేజీ తరువాయి

చెప్పాలన్నారు. గతంలో తమ పార్టీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి లాయర్ను తీసుకెళ్లకుండా విచారణకు వెళ్తే తప్పుడు అభియోగాలు మోపారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఇలాంటి పనికిమాలిన చర్యలు మానుకోవాలని, రాజ్యాంగబద్ధంగా పరిపాలన కొనసాగించాలని హితువు పలికారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సతీష్, ప్రభాకర్ రెడ్డి, మోహిజ్, భానుచందర్ గౌడ్, సయ్యద్, కుమార్ పలువురు పాల్గొన్నారు

# మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, కాంట్రాక్టు ఉద్యోగం



- ఇద్దరు అధికారుల సస్పెన్షన్, ముగ్గురికి బదిలీ
- సిబ్బంది నిర్లక్ష్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

**తిరుపతి :** తిరుపతిలో భక్తుల తొక్కిసలాట ఘటనను ఏపీ సర్కార్ సీరియస్ గా తీసుకున్నది. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ స్థానిక డీఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డిని సస్పెండ్ చేసింది. అలాగే ఎస్పీ సుబ్బారాయుడు, జేఈవో గౌతమి, టీటీడీ సీఎస్వో శ్రీధర్‌పై బదిలీ వేటు వేసింది. తొక్కిసలాటకు సంబంధించి గురువారం ఉదయమే తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు నుంచి ప్రాథమిక నివేదిక తెప్పించుకున్న సీఎం చంద్రబాబు నాయుడు తాజాగా ఈ ఘటనపై న్యాయవిచారణకు ఆదేశించారు. వాస్తవాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. కొంత మంది అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలిపిన సీఎం.. ముఖ్యంగా డీఎస్పీ రమణకుమార్ బాధ్యత లేకుండా ప్రవర్తించారని మీడియాకు వివరించారు. మరోవైపు తొక్కిసలాట ఘటనలో చనిపోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. టీటీడీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలతో పాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగాలు ప్రకటించారు. తీవ్ర గాయాలైన ఇద్దరికి రూ.5 లక్షలతో పాటు ఆరోగ్యం మెరుగయ్యే వరకు వైద్య ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. గాయాలపాలైన 33 మందికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం, అందరికీ శ్రీవారి దర్శనానికి ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. దర్శనం పూర్తయ్యాక గాయపడిన వారిని వారి స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. తొక్కిసలాట ఘటనలో క్షతగాత్రులను పరామర్శించేందుకు గురువారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్న సీఎం చంద్రబాబు ముందుగా ఆయన తొక్కిసలాట బైరాగిపట్టెడ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ క్రమంలోనే అయన టీటీడీ ఈవో, కలెక్టర్, ఎస్పీ అధికారులపై సీరియస్ అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏదైన ఒక పని బాధ్యత తీసుకున్న వారు సక్రమంగా నెరవేర్చాలని అన్నారు. ఇక నంచి అయినా.. పద్ధతి ప్రకారం పని చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. టోకెన్లు జారీ చేసే కౌంటర్ వద్ద 2 వేల మంది మాత్రమే పడతారని అనుకున్నప్పుడు 2,500 మందిని ఎలా లోనికి పంపించారని అధికారులను ఆయన ప్రశ్నించారు. ఈ క్రమంలో స్పందించిన అధికారులు భక్తులు కూర్చున్నప్పుడు పరిస్థితి అంతా బాగానే ఉందని తెలిపారు. బయటకు వదిలేప్పుడు ఒక్కసారిగా పరిస్థితి అదుపు తప్పిందని సీఎంకు వివరణ ఇచ్చారు. దీంతో సీఎం చంద్రబాబు 'నో ఎక్స్‌ప్లనేషన్స్' అంటూ వారిపై సీరియస్ అయ్యారు.

# ఒక ప్రమాదంతో కుటుంబం చిన్నాభిన్నం

## ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా చేరండి



- హెల్మెట్ తప్పక ధరించాలి
- నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపొద్దు
- సిద్దిపేటలో ట్రాఫిక్ ఏసీపి సుమన్ కుమార్

**సిద్ధిపేట, జనవరి 9 (ది సిద్ధిపేట టైమ్స్):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం సిద్దిపేటలో ట్రాఫిక్ ఏసీపి సుమన్ కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బీజేఆర్ చౌరస్తాలో వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. తల్లిదండ్రులు వాహన యజమానులు సరదాల కోసం పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం దుఃఖసాగరంలో మునిగిపోతుందని హెచ్చరించారు. సరదా ఎప్పుడు కూడా విషాదంగా మిగల వద్దన్నారు. ప్రతి వాహనదారుడు రవాణా శాఖ ఉత్తర్వుల మేరకు వాహనాలకు నెంబర్ ప్లేట్ బిగించుకోవాలి.. తరచుగా నెంబరు ప్లేట్ లేని వాహనాల ఛోదకులు వేగంగా నడుపుతూ తోటి వాహదారులను, పాదచారులను, భయభ్రాంతులకు గురిచేస్తున్నందున నంబరు ప్లేట్లులేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. మోటార్ సైకిల్ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనదారులు అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడుపుతునందున్న ప్రమాదం జరిగే అవకాశం ఉందని, నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మోటార్ సైకిల్ పై ముగ్గురు ప్రయాణించవద్దని, వాహనం నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ వెంట ఉంచుకోవాలని, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలని, హెల్మెట్ మా శాసనం కాదు మీ సంక్షేమంగా భావించాలన్నారు. హెల్మెట్ ఒక వస్తువు కాదు ప్రాణాన్ని కాపాడే ఆయుధం. రోడ్డు చిన్నదైనా పెద్దదైనా పడితే ప్రమాదమే అన్నారు. నంబర్ సరిగ్గా లేని వాహనాలపై కొంతమంది నేరస్తులు వచ్చి దొంగతనాలు చేయడం, చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తరచుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.

# సంక్షేమం పట్టని సర్కార్

## కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

## సీఎం రేవంత్ కు కేంద్రమంత్రి బహిరంగలేఖ

▶▶ మొదటి పేజీ తరువాయి

చెల్లించకుండా ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులను ఇబ్బంది పెడుతున్నారు. పేదలకు ప్రైవేట్ వైద్యం అందకుండా చేయడం ఎంత వరకు సమంజసం? తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి దాదాపు పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ కూడా ఏనాడూ ఆరోగ్య శ్రీ పథకాన్ని సక్రమంగా అమలు చేసిన దాఖలాల్లేవు. బకాయిలు చెల్లించకుండా పేదలకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందకుండా చేస్తూ ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడిచారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరోగ్యశ్రీ బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించడంతోపాటు ఆరోగ్యశ్రీ సేవలను విస్తృతం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మీరు ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టాక ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతున్నారు. మీ ఏడాది పాలనలో దాదాపు రూ.1000 కోట్ల మేరకు ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు నెట్ వర్క్ ఆసుపత్రులు చెబుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులు నిర్ణయించిన ధరతో పోలిస్తే సగానికంటే సగం తక్కువ ధరకే ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ బిల్లులను కూడా నెలల తరబడి చేయకపోవడంతో సిబ్బందికి వేతనాలు, నిర్వహణ ఛార్జీలు, ప్రభుత్వ పన్నులు చెల్లించలేక పోతున్నామని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు వాపోతున్నాయి. ఆరోగ్యశ్రీ సేవలందించేందుకు నిరాకరిస్తున్నాయి. మీ చేతగానితనం, నిర్లక్ష్యం ఫలితంగా సకాలంలో వైద్యం అందక, ఆపరేషన్లు నిర్వహించకపోవడంతో రాష్ట్రంలో అనేక మంది రోగులు మృత్యువాత పడుతున్న సంఘటనలు తీవ్రంగా కలిచివేస్తున్నాయని' బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని కూడా మీరు ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నట్లు కన్పిస్తోంది. రాష్ట్రంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మ సీ, నర్సింగ్ వంటి కోర్సులను చదువుతున్న దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారు. కానీ గత బీఆర్ఎస్ పాలకులు కానీ, ప్రస్తుతమున్న కాంగ్రెస్ ప్రభుత్వం కానీ ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులను విడుదల చేయకపోవడంవల్ల దాదాపు రూ.7వేల కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం కారణంగా కాలేజీల నిర్వహణ భారమై రాష్ట్రవ్యాప్తంగా వందల కాలేజీలు మూసివేతకు సిద్దంగా ఉన్నాయి. తమ కాలేజీలు నడవాలంటే ఫీజు రీయంబర్స్ మెంట్ భారాన్ని విద్యార్థులే మోయాలని, లేనిపక్షంలో సర్టిఫికెట్లు ఇవ్వబోమని యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. దీంతో ఫీజులు చెల్లించే స్తోమత లేక లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నారు. కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో పై చదువులకు వెళ్లలేక కొందరు, ఉద్యోగాలకు నోచుకోక మరికొందరు తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. ఫీజు రీయంబర్స్ మెంట్ పెండింగ్ బిల్లుల్లో సుమారు రూ.380 కోట్ల మేరకు చెల్లిస్తామని గత ఏడాది నవంబరులో టోకెన్లను జారీ చేసినా వీటికి సంబంధించిన చెల్లింపులను నేటికీ చేయకపోవడం సిగ్గు చేటు. పేరుకు పోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ పద్ధతిలో క్లియర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు వస్తున్న వార్తలను చూసి విస్మయం కలుగుతోంది. అవేమైనా బ్యాంకు లోన్లా? వడ్డీలతో కలిపి బకాయిలు పెరిగిపోతే వన్ టైం సెటిల్ మెంట్ చేసుకోవడానికి? ఇవ్వాల్సిన సొమ్మును సకాలంలో చెల్లించకపోవడమే కాకుండా... అందులోనూ కోత విధిస్తామని చెప్పడం దుర్మార్గమని' బండి సంజయ్ మండిపడ్డారు. 'ప్రజలకు సరైన విద్య, వైద్య సేవలు అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత. కానీ ముఖ్యమంత్రి హోదాలో మీరు వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ఆ బాధ్యతలను పూర్తిగా విస్మరిస్తున్నట్లు స్పష్టంగా కన్పిస్తోంది. ఫీజు రీయంబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిల విలువ రూ.8వేల కోట్ల లోపే. 2.75 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ రూపొందించిన మీకు అందులో నుండి రూ.8 వేల కోట్లు చెల్లించి లక్షల మంది రోగులను, విద్యార్థులను ఆదుకోలేరా? విదేశీ పర్యటనలు, ఢిల్లీ పర్యటనలు, మూసీ పునరుజ్జీవం, ఫోర్త్ సిటీ పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న మీకు రూ.8 వేల కోట్లు చెల్లించేందుకు మనసు రాకపోవడం శోచనీయం. పేదల ప్రాణాలంటే మీకెంత చులకన ఉందో, విద్యార్థుల భవిష్యత్తుపట్ల మీకెంత చిన్నచూపు ఉందో దీనినిబట్టి తేటతెల్లమవుతోంది. ఇకనైనా పేదల పట్ల మీరు చూపుతున్న వివక్షను విడనాడాలి. తక్షణమే ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులతో, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో సమావేశమై ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల, పేదలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధం. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని' బండి సంజయ్ కుమార్ హెచ్చరించారు

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఒకరికి జైలు

**సిద్ధిపేట, జనవరి 9 (ది సిద్ధిపేట టైమ్స్):** సిద్ధిపేట వన్ టౌన్ పోలీసుల వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ. 6 వేల చొప్పున జరిమానా, ఒకరికి 5 రోజుల జైలు శిక్ష విధించింది కోర్టు. సిద్ధిపేట వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, ఎస్ఐలు సిబ్బందితో కలిసి కొన్ని రోజుల కిందట సిద్ధిపేటలో వాహనాల తనిఖీలు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ దొరికారు. వారిని పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం తాగి ఉన్నారని రిపోర్టు రాగా గురువారం సిద్ధిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచారు. విచారణ చేసి ముగ్గురికి రూ. 6 వేలు జరిమాన విధించారు. కొత్తూరు సంతోష్ అనే వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు.

# భూ భారతి కి గవర్నర్ ఆమోదం

## అమలుకు సర్కారు సన్నాహాలు

▶▶ మొదటి పేజీ తరువాయి



అందించాలన్న ఆశయంతో ఈ చట్టాన్ని తీసుకు వచ్చినట్లు వెల్లడించారు. రెవెన్యూ చట్టం 2020 తో సామాన్య ప్రజలు, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని పొంగులేటి చెప్పారు. భూ సమస్యలేని గ్రామం తెలంగాణలో లేదన్నారు. గత ప్రభుత్వం తమ వ్యక్తిగత స్వార్థం కోసం ప్రయోజనాల కోసం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు అందించడానికి తమ ప్రభుత్వం విస్తృతమైన చర్యలు చేపట్టిందని చెప్పారు. గ్రామాల్లో రెవెన్యూ పాలనను చూడడానికి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామనీ దానికి సంబంధించిన కసరత్తు కొలిక్కివచ్చిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ విభాగం పని చేయాల్సిందేనన్నారు. ప్రజా పాలనలో ప్రజలు కేంద్ర బిందువుగా తమ ప్రభుత్వ నిర్ణయాలు, ఆలోచనలు ఉంటాయని చెప్పారు. వాటిని దృష్టిలో పెట్టుకొని సామన్య ప్రజలు సంతోషపడేలా రెవెన్యూశాఖలో అధికారులు, సిబ్బంది సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఇకపై సాగు భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల పోర్టల్ ధరణి స్థానంలో భూభారతి అమల్లోకి రానున్నది.

**'భూ భారతి'లో తహశీల్దార్లకు అధికారాలు**

ధరణి చట్టంలో భూమి సమస్యను పరిష్కరించడానికి అధికారులకు ఎలాంటి అధికారాలు లేవు. ఎలాంటి అధికారాలు కూడా లేకుండా కలెక్టర్, సీసీఎల్ఏలు పని చేశారు. భూ భారతి చట్టంలో తహశీల్దార్ మొదలుకొని.. కలెక్టర్ వరకు సమస్యలను పరిశీలించి, పరిష్కరించే అధికారాలు ఉండడం విశేషం. తాజాగా చట్టంతో ప్రభుత్వం ఎంత సమర్థవంతంగా అమలు చేస్తే ప్రజలకు అంత మేరకు సత్వర న్యాయం జరిగే అవకాశాలున్నాయి

# బీజేపి మండల అధ్యక్షుడిగా దేవా సుధాకర్ రెడ్డి



**దుబ్బాక, జనవరి 9 (ది సిద్ధిపేట టైమ్స్):** అక్బర్ పేట భూంపల్లి బీజేపి మండల అధ్యక్షుడిగా దేవా సుధాకర్ రెడ్డిని ఎన్నికైనట్లు సిద్దిపేట జిల్లా ఎన్నికల ఇన్చార్జి సారంగుల అమర్నాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ..కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటూ జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఇచ్చే పిలుపు మేరకు పార్టీ కార్యక్రమాలను నిర్వహించి విజయవంతం చేస్తామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేవరకు పోరాడుతామన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి తనను అక్బర్ పేట భూంపల్లి మండల అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావుకు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డికి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్ గౌడ్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# బీజేపి దుబ్బాక పట్టణ అధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్



**దుబ్బాక, జనవరి 9 (ది సిద్ధిపేట టైమ్స్):** భారతీయ జనతా పార్టీ దుబ్బాక మున్సిపల్ పట్టణ అధ్యక్షుడిగా దొరగొల్ల శ్రీకాంత్ యాదవ్ ను నియమిస్తూ బీజేపి సిద్ధిపేట జిల్లా ఎన్నికల ఇన్చార్జ్ సారంగుల అమర్నాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ... తనపై నమ్మకం తో దుబ్బాక మున్సిపల్ అధ్యక్షునిగా నియమించినందుకు మెదక్ ఎంపీ రఘునందన్ రావుకి, జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డికి, బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపి బలోపేతానికి కృషి చేస్తూ రాబోయే స్థానిక ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలపారు.